# తనదాకా వస్తే...?

— యస్. గోవిందరాజులు



కథ పెండ్లికి ముందు లేదు. పెండ్లి తరువాతనే. రాజుకి మంచి చదువు అంతకన్నా మంచి ఉద్యోగం వున్నది.

కాబోయే పెండ్లి కొడుక్కి ఆ రెండూ వుంటే చాలనుకొని రాణికి బేరం చేసి కొనేసారు.

రాజా రాణీల పెండ్లి అలా అయింది.

మార్కెట్‌లో రాజు చాలా ఎత్తులోనే వున్నాడు కానీ, రాణి అందం చూసి తనే చెట్టుదిగి బేరం కొంచెం సడలించి రాణి మెళ్ళో మూడు ముళ్ళు వేశాడు.

అలా అయింది ఇద్దరి పెండ్లి.

రాజుకి తన భార్యని చూస్తే చెప్పలేనంత ఆశగా వున్నది- తను అనుకున్న దానికన్నా అందగత్తె దొరికిందని. అయితే తన భావాన్ని ఏనాడూ భార్యవద్ద చెప్పుకోలేదు.

పెండ్లయిన వారం రోజులకి "హనీమూన్" అన్నాడు.

భర్త రూపాన్ని చూసి మనసులోనే బెంగపెట్టుకొని వున్న రాణి 'హనీమూన్' అనగానే చెంగున ఎగిరింది.



'ఫర్వాలేదు. రూపం ఎలా వున్నా శాస్త్ర అన్నీ తెలిసిన వాడే' అనుకొంది.

ఇద్దరూ మద్రాసునుండి ఊటీకి బయల్దేరారు.

మద్రాసునుండి బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్‌లో కూపేలో కూలబడ్డారు.

ఊటీలో చలిని తలచుకొని దానికి కావలసిన శాల్సు, రగ్గులు, సూటు అన్నీ తీసుకొనే బయలుదేరారు.

"రాణీ! ఊటీలో లిమ్‌కా తాగవలసిన పనిలేదు. అందుకే ఇక్కడే ఓ రెండు లిమ్‌కాలు తాగు!" రాజు అన్నాడు.

రాణికి లిమ్‌కా అంటే ఇష్టం. తాగమన్నందుకు సంతోషం కలి

గిందిగానీ 'రెండు' అనే మాట వలన వుక్రోషం వచ్చి,

"నేనేం మొహం వాచి చావనులే" అంది.

"ఛా! అదేం మాట" అని నిజంగానే ఓ లిమ్కా తీసి ఇచ్చాడు.

తీరా దాన్ని చూసిన తర్వాత వుక్రోషాన్ని మరచిపోయి త్రేన్చుకొంటూ తాగింది.

బండి బయలుదేరింది.

"కోయంబత్తూరువరకూ భయం లేదు" అన్నాడు రాణి ప్రక్కన కూర్చుంటూ.

"ఇప్పుడు టికెట్ కలెక్టరు వస్తాడు" అంది అతనిని వుడికించడానికి.

అది తను మరచిపోయినందుకు నాలిక కరచుకొన్నాడు.

"వాడు వచ్చేవరకూ ఏమైనా కబుర్లు చెప్పు" అన్నాడు రాజు.

"ఏం చెప్పను?" కళ్ళు త్రిప్పుతూ అన్నది.

"నీ చిన్నప్పటి సంగతులు ఏమైనా!"

రాణి కొంచెంసేపు బుగ్గన చెయ్యి చేర్చుకొని ఆలోచిస్తున్నట్లు వుండి ఫకాలున నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?"

"మరే! మా చిన్నప్పుడు కె.సి. ఛారిటీస్ ఫండ్ లాటరీ వచ్చేది. దానికి మా అన్నయ్య టిక్కెట్స్ సరదాగా ఫ్రెండ్స్ దగ్గర కలెక్టుచేసి పంపేవాడు. రూపాయికి పావలా లాభం అంట.

ఆ రూపాయి మా అక్కచెల్లెళ్ళవద్ద వసూలు చేయడానికి బోల్డన్ని కబుర్లు చేప్పేవాడు.

"పెద్ద పాపా! అంటే మా అక్క అన్న మాట. నీవు రూపాయి ఇచ్చావనుకోవే, అప్పుడు మనకి లాటరీలో లక్ష రూపాయలు వచ్చేస్తాయి. అప్పుడు మధుమతి హిందీ సినిమా మనమే తెప్పించుకొని, మనం మాత్రమే పెద్ద ఎంబాసిడర్ కారులో వెళ్ళి, మనం మాత్రమే హాలంతా కూర్చుని సినిమా చూడవచ్చు" అని అనేవాడు.

మా అక్కకి హిందీ సినిమాలంటేను వాటి పాటలంటేను పిచ్చ ప్రేమ. మధుమతి సినిమా చూడాలని దానికి ఆశగా వున్నది. అది ఎంత పాత సినిమా అయినా మా వూరికి రాలేదు. అందుకే దానికి ఆ గేలం.

"సత్యా! అంటే మా చిన్నక్క అన్న మాట. దానికి అందమైన బిల్డింగ్‌లో చక్కటి ఫర్నిచర్‌తో ఎంబ్రాయిడరీచేసి అలకరించుకొని అందులో వుండాలని దాని ఆశ. దానితో అనేవాడు- సత్యా! మన

ఏటిలో పెద్ద దిబ్బ వుంది కదా! లక్షరూపాయలు రాగానే ఆ దిబ్బ మీద నాలుగంతస్థుల మేడ కట్టించేసి దిబ్బకి ఏటిగట్టుకి వంతెన వేయించేస్తాను. మన నలుగురుకీ నాలుగు అంతస్థులు. నేను మాంచి హిందీ యాక్టరుని పెండ్లి చేసుకుంటా" అనేవాడు.

"ఒరేయ్ అన్నయ్యా! ఇల్లు వరకు బావుందిగానీ హిందీయాక్టర్ వదిన వద్దురా! అది నీకన్నా వయస్సులో పెద్దదిరా!" అని పడీ పడీ నవ్వేది.

"మైక్యాకరుం రామ్ ముజె బుడ్డీ మిల్ గయా ముజె బుడ్డీ మిల్ గయా" అంటూ నెత్తి మీద చేతులు పెట్టుకొని, నడుం మీద పెట్టుకొని తిప్పుకొంటూ డాన్స్ చేసేవాడు. మేము కడుపులు పట్టుకొని నవ్వేవాళ్ళం."

గత జ్ఞాపకాలలోకి దిగుడు బావి లోకి జారినట్లు జారిపోయి వుత్సాహంగా చెప్పుకు పోతోంది రాణి.

"మరి నీకో! నీ కోరిక ఏమిటి?" రాజు కుతూహలంగా అడిగాడు.

రాణి యింకా దిగుడు బావి లోనే వున్నది. పైకి రాలేదు. వచ్చి వుంటే ఆ ప్రశ్న వేసిన భర్త మనసులోని భావాన్ని స్పష్టంగా చదివేదే.

"నాకు చిన్నప్పటి నుండీ ప్రకృతి అంటే చాల ఇష్టం అండీ! తోటలు, చెఱువులూ, వాఁలువులూ, పూవులూ, బొమ్మలూ అంటే చాల యిష్టం. అప్పటికి వూటీ బొటాని కల్ గార్డెన్ మంచి పేరు పొంది వుంది. కాబట్టి నన్ను అక్కడికి తీసుకొని వెళ్తానని అన్నాడు.

మా పిచ్చిగానీ, మాకు లాటరీలో డబ్బు వస్తే వాడు బిల్డింగ్ కట్టించడ మేమిటి? ఆ ఆలోచన మాకెవ్వరికీ రానేలేదు.

మేము ఆ మాటలకి వుబ్బిపోయి మా మా పాకెట్ మనీలోంచి రూపాయి తీసి యిచ్చేసే వాళ్ళం.

అయితే ఏం? మా అన్నయ్య మాకు చేమంతి పూవులు, మిఠాయి పొట్లాలూ, బొమ్మలూ, డబ్బులు ఇంకా ఎక్కువ వుంటే జాకెట్టు బట్టలూ తెచ్చేవాడు.

ఇప్పుడు కనీసం మా స్మృతికి చిహ్నంగా ఆ ఏటిలో దిబ్బ అయినా లేదు. ఒకసారి వరదలకి అది కొట్టుకు పోయింది- మా కలల మాదిరిగానే.

మా నలుగురి కలలు- ఏ ఒక్కరివీ తీరనేలేదు!" చివరకి విచారంగా అన్నది.

రాజు మొహం గంటు పెట్టుకు కూర్చున్నాడు.

హఠాత్తుగా రాణికి బాహ్య స్మృతి కలిగింది. తను చివర అన్న మాట భర్తకి తగిలిందని తలచి నొచ్చుకుంది.

"నాది సరేగాని, మీ చిన్ననాటి ముచ్చట్లు చెప్పండి" అంది నవ్వుతూ.

"ఏమీ లేవు."

"ఆహా! ఏమీ లేకుండా అసలు బాల్యం అంటూ వుండనే వుండదు. చిన్నతనంలో ఎంత పేదరికం అయినా సరేండనీ-అవే బంగారపు రోజులు. గుప్తుల కాలం స్వర్ణ యుగం అని చరిత్రలో ఎలా అంటారో ప్రతిమానవుడి చరిత్రలో బాల్యం స్వర్ణయుగం వంటి స్వర్గం" అని అన్నది.

"నీవు కొంపదీసి కథలు వ్రాస్తావా?"

"లేదు. అదేం అలా అడిగారు?"

"నీ మాటలు అలా వున్నాయి. పోతే నా భార్య రచయిత్రి కావడం నా కిష్టం లేదు" అన్నాడు అసలికే వికృతంగా వుండే మొఖాన్ని ఇంకా వికృతంగా చేసుకొని.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి.

"ఏమైనా కబుర్లు చెప్పండి!" ప్రాధేయ పూర్వకంగా అంది.

కొన్ని క్షణాలు భార్య వేపు చూసి, "నాకు తెలిసిన కబుర్లు చెప్తే నీవు బాధ పడతావేమో!" సందేహంగా అన్నట్లు నామ్చుతూ అన్నాడు.

"వూహూ" తల అడ్డంగా తిప్పింది.

"నేను యస్.యస్. యల్. సి. చదివేటప్పుడు మా క్లాసులో రేవతి అనే అమ్మాయి వుండేది. అందగత్తె! అందం అంటే ఆ అమ్మాయిదే. ఆ అమ్మాయి రొమ్ములు పొడుచుకొని వచ్చి వుండి మగాడి కళ్ళల్లో గుచ్చుకున్నట్లు...."

అతని వర్ణనకి అసహ్యం కలిగింది రాణికి. అయినా దాన్ని బయట పడనీయకుండా మౌనంగా వుండి తన అసహ్యం మొహంలో కనబడుతుందేమోనని చీర కుచ్చీళ్ళు సర్దుకునే నెపంతో తల వంచుకొన్నది.

రాజు ఆమె అంగాంగాన్ని వర్ణించాడు వుత్సాహంగా.

ఎంతో ఓర్మితో విన్నది.

"మీరు అందాన్ని వర్ణించడం మొదలు పెట్టి చాలసేపు అయింది. అసలు కథ చెప్పండి" అన్నది బలవంతంగా నవ్వుతూ.

"మేమిద్దరం ప్రేమించుకొన్నాం!" వెంట ఎవరో తరుముతున్నట్లు గబుక్కున అనేశాడు.

"తరువాత....?" వుత్సాహంగా అంది.

రాజు బిత్తరపోయాడు, ఆమె ముఖం వాడి పోతుందనుకున్నాడు. దానికి విరుద్ధంగా వుత్సాహంగా వుంది.

"తరువాత ఏముంది? నన్ను పెండ్లి చేసుకోమని కోరింది. చదువు కావాలి. అదీగాక యీ వయస్సులో పెండ్లి ఏమిటి అని అన్నాను."

"రేవతి ఏమైయింది?"

"ఆ సంవత్సరంతో పెండ్లి అయిపోయింది. నేను పి. యు. సి లో చేరాను. ఓ రోజు బజారులో కనబడి సాయంకాలం వాళ్ళ ఇంటికి రమ్మనమని పిలిచింది. వెళ్ళాను. నే లోనికి వెళ్ళగానే వీధి తలుపులు మూసేసింది."

రాజు వూబిలోకి దిగి వుత్సాహంగా చెప్తున్నాడు.

రాణి వూబిలోకి కూరుకు పోతున్న వారిని ఎంత నిస్సహాయురాలిగా చూస్తుందో అలానే చూస్తూ విచార వదనంతో కూర్చుంది.

"తలుపులు ఎందుకుమూసావు?' అని అడిగాను. నా మాట విని పించుకోకుండా నా చెయ్యి పుచ్చుకొని నన్ను మంచం వేపుకి లాక్కొని వెళ్ళింది. నేను వణికి పోయాను. రేవతి నన్ను కౌగిలించుకొని, 'రాజూ డియర్! ఐ లవ్ యూ' అని నన్ను ముద్దులతో ముంచేసింది. 'నీ మీద కోరిక వున్నది. నేను ఒకరికి భార్యని అయినా సరే, నేను లోకం దృష్టిలో పతితనయినా సరే నీవు కావాలి' అని నన్ను మంచం మీదకు తోసేసింది. ఈ కథ మా యిద్దరి మధ్యా సంవత్సరం నడిచింది. తరువాత అయినా ఎందుకు ఆగిందంటే నా జీవితంలోకి భారతి ప్రవేశించింది..." అని ఆగాడు.

తిరిగి చూస్తే రాణి కూర్చొనే నిద్రపోతోంది. తన మాటలన్నీ వినిందో లేదో తెలియలేదు.

పళ్ళు కొరుక్కున్నాడు.

*   *   *

ఊటీ టూరిస్టు సెంటరు.

చలి ఎక్కువ. అన్నీ ఎక్కువే. ఎందుకంటే టూరిస్టు సెంటరు కావడం వలన.

లాడ్జి బాయ్ వచ్చి ఒక స్లిప్పు యిచ్చి రేపు తొమ్మిది గంటలకి బస్సు బయలుదేరుతుందని, సాయంకాలం వరకూ త్రిప్పి తీసుకొస్తుందని, మనిషికి నలభై రూపాయలని చెప్పాడు.

"ఏ సంగతీ సాయంకాలానికి

చెప్పండి" అని వెళ్ళిపోయాడు.

వీళ్ళు వెళ్ళేసరికి తెల్లవారి పది అయింది. స్నానం చేసి, మీల్సు చేసి బయటకొచ్చారు. అయినా చల్లగానే వున్నది.

స్వెట్టర్లు, కోట్లు వున్న బట్టల షాపులు, నీలగిరి తైలం, టీ పొడి షాపులు, లాడ్జింగులు, హోటల్సు మాత్రమే ఆ వూరిలో వున్నాయి. శాస్త్రానికి కూడా ఫ్యాన్ అన్నది కనబడదు.

రాణి ఆ వూరిని చూసి సంతోష పడింది.

తాము వున్న లాడ్జికి బొటానికల్ గార్డెన్ దగ్గిరే కావడం వలన నడిచి అక్కడికి వెళ్ళారు.

సాయంకాలం కావడం వలన ఫోటోగ్రాఫరుల బెడద లేదు. అందులోకి అడుగు పెడుతూ వుంటే స్వర్గంలోకి, ప్రశాంతతలోకి అడుగు పెడుతున్నట్లు వున్నది. జీవితం ఎంత భయంకరం అయినా గానీ, యీ గార్డెన్ విడిచి బయటకి వెళ్ళిన తరువాత తన ప్రాణం పోతుందని తెలిసినా, అక్కడ వున్నంతసేపు ఏ బాధా అంటదు. అంతటి శక్తి ఆ ప్రకృతి సౌంద ర్యానికి వున్నది.

పచ్చికలో పూల వద్ద కూర్చొని పెద్ద పెద్ద డేరియా పూవులని చూస్తూ నవ్వుకొంది రాణి. లాటరీలో లక్షరూపాయలు వస్తే అన్నయ్య యిక్కడకి తీసుకొస్తా నన్నాడు. లక్ష రాలేదు—కాబట్టి అన్నతో రాలేదు. కానీ కలలో నైనా తలంచలేదు-భర్తతో వస్తా నని. జీవితం ఎంత విచిత్రం అనుకొంది.

"ఈ తోటలో యీ చెట్లమధ్య గడపాలని నేనూ, భారతి ఎంతో కలలు గన్నాం." హఠాత్తుగా అన్నాడు రాజు.

సుందర లోకంలోకి భూతం వచ్చి భయ పెట్టినట్లు వులిక్కి పడింది రాణి.

రాణి పెదవి కదపలేదు.

"ఎన్నెన్నో కలలు కలబోసుకున్నాం. కానీ ఏం ప్రయోజనం? కొంతమంది కలలు పండవు" అని అసలుకే నల్లగా వుండే పెదాలని, సిగరెట్లు తెగ తాగి యింకా అసహ్యం చేసుకున్న పెదవులని నిరాశగా విరిచాడు.

రాణికి నవ్వు వచ్చిందిగానీ బలవంతంగా ఆపుకొంది.

ఆ రోజూ అలా గడిచింది.

మరుసటి రోజు గుంపులో గోవిందలాగా కాకుండా యిద్దరూ ప్రత్యేకంగా టాక్సీని ఎంగేజ్ చేసుకొని, 'దొడ్డదబెట్ట' మీదికి

వెళ్ళారు. నిండు పాల కుండలో విషపు బొట్లు మాదిరి దారి పొడుగునా ఆ 'దొడ్డద బెట్ట' మీద కూడా రాజు తన ప్రియురాండ్ల ప్రసక్తి తీసుకొని రాకుండా వదల లేదు.

అంత అందమైన వూరుని చూస్తూ కూడా చేదుమాత్ర మింగే రోగిలానే వున్నది రాణి.

సాయంకాలం తిరిగి బొటానికల్ గార్డెన్‌కి వెళ్ళారు.

చిన్న నీటి కోనేరు ప్రక్కన కూర్చుంటూ దీర్ఘంగా నిట్టూర్చింది రాణి.

"ఏం అలా నిట్టూర్చావు?" రాజు ప్రశ్నించాడు.

"ఏమీ లేదు. వింటే మీరు బాధ పడతారు." మొదటి చురక అంటించింది.

"చెప్పు!"

కథా నిలయం
శ్రీకాకుళం

త్వరలో!

## కొత్త సీరియల్ ప్రారంభం!

వివరాలు వచ్చే సంచికలో!

"మా సురేష్ బావ జ్ఞాపకం వస్తున్నాడు. తను వట్టి తుంటరి. నన్ను అస్తమానం ఎర్రకోతి అని ఏడిపించేవాడు. నేనంటే పడి చచ్చేవాడు. ఏయ్! నన్ను మర్యాదగా పెళ్ళాడకపోతే నిన్ను వూటీకి లేవదీసుకుపోతా అని అనేవాడు...." అంటూ వాళ్ళ బావది తనది ప్రేమాయణం చెప్పసాగింది వుత్సాహంగా.

రాజు మొఖం గంటు పెట్టుకొని కూర్చున్నాడు.

* * *

వూటీ నుండి మైసూరు, మైసూరు నుండి బెంగుళూరు చూపి మద్రాసు రావాలనుకున్న ప్రయాణాన్ని కేన్సిల్ చేసుకొని మద్రాసు వచ్చేశారు క్రొత్త దంపతులు.

రాజు అస్తమానం చిటపట మంటున్నాడు నిప్పు మీద పడ్డ ఉప్పులా.

ఆఫీసుకొచ్చి కూర్చున్నాడు.

ఫ్రెండ్సు అందరూ హనీమూన్ విశేషాలు కాఫీటిఫిన్‌తోసహా చెప్పమని చుట్టుముట్టారు. వాళ్ళని చూడగానే చెమటలు పోశాయి. కర్చీఫ్ కోసం జేబులో చెయ్యి పెడితే కాగితం తగిలింది. తీసి విప్పాడు.

"శ్రీవారికి,

మీ చిటపటలు ఎందుకో నాకు తెలుసు. నాకు అసలు బావలు ఎవరూ లేరు. మీరు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో (మీ అందం నా అందంతో పోల్చుకొని) బాధ పడుతూ రేవతిని భారతిని యింకా ఎక్స్‌ట్రాలని సృష్టించి మీరో వీరుడు మగధీరుడుగా భార్య దృష్టిలో మారి పోదామనుకున్నారు. కాలం మారింది. ఈ కాలం వనిత భర్త హృదయంలో తాను తప్ప యింకో స్త్రీ వుండకూడదని కోరుకుంటుంది. అది గ్రహించక మీరు హనీమూన్‌ని పాడు చేశారు—మీ అద్భుత కల్పనలతో.

మీ కల్పిత ప్రియురాళ్ళ శ్రవణం గారాన్ని వినలేక నేను 'సురేష్ బావ'ని సృష్టించాను. అర్థం అయిందనుకుంటా! సాయంకాలం యింటికి అన్నీ వాష్ చేసుకొని ఫ్రెష్‌గా రండి. ఇలా వ్రాశానని నాలిక కొరుక్కోవద్దు.

మీ రమారాణి."

రాజు బరువు తీరినట్లు వూపిరి పీల్చి తన సహోద్యోగులని కాంటీన్ వేపుకి తోసుకొని పోతూ, "ఇంకో వారం రోజుల్లో మేము కాశ్మీరు వెళ్తాం" అన్నాడు తనకు అవుతున్న ఖర్చుని మరచిపోతూ. *